

PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీతూ
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

మంగళవారం 10 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 160 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర.. రూ.9,053.48 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొడంగల్, సందేశం టైమ్స్ ప్రతినిధి: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా మూడో రోజు ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి దుద్యాల మండలం పోలేపల్లిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందిన అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలసి లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్ వరకు ఉత్సాహంగా పాదయాత్ర చేపట్టారు. లగచర్ల ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటు చేసిన రైతన్న ఆత్మీయ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్, సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, మల్లు రవిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు ఈ సభకు పెద్దఎత్తున హాజరయ్యారు.నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 కీలక అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. వీటిలో ప్రధానంగా కొత్వాల్‌గూడ నుంచి నాచారం వరకు రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు-2 నిర్మాణం, ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.1,410 కోట్లతో 223 కొత్త బీటీ రహదారులు, రూ.2,100 కోట్లతో మక్తల్–నారాయణపేట్–కొడంగల్ లిఫ్ట్ (#MNKLIS) రెండో దశ పనులు, రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.123 కోట్లతో కొడంగల్‌లో వ్యవసాయ కళాశాల, రూ.41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్టాండ్లు, రూ.20 కోట్లతో మద్దూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (NAC) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం, రూ.59.30 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు, తిమ్మారెడ్డిపల్లిలో రూ.4.45 కోట్లతో గురులోక మసంద్ ప్రభు మందిరం, కొడంగల్‌లో రూ.5.10 కోట్లతో నిరంజన్ మఠం అభివృద్ధి పనులు, హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్ నిర్మాణం మరియు రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణాలు ఉన్నాయి.

సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చేసిన అప్పులను చెల్లిస్తూనే తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెడతామని తెలిపారు. 2028 డిసెంబర్ నాటికి కృష్ణానది జలాలతో కొడంగల్ భూములను తడిపి పచ్చని పంటలు పండిస్తామని పోలేపల్లి ఎల్లమ్మ అమ్మవారిపై ఒట్టు వేసి మాటిచ్చారు. పరిశ్రమల స్థాపన ద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. అలాగే ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి ఎద్దడి పరిస్థితులు ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు వేయాలని విజ్ఞప్తి చేస్తూ, వచ్చే సంక్రాంతి తర్వాత "ప్రజాబలం" కార్యక్రమంతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తానని వెల్లడించారు.



'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలు విజయవంతం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి: దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రజాప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని, లక్షలాది పేద కుటుంబాలు తమ ఇందిరమ్మ ఇళ్లలో ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించడమే ప్రభుత్వ సంకల్పమని, ఇవి కేవలం ఇళ్లు మాత్రమే కాకుండా పేదల దశాబ్దాల నిరీక్షణకు దక్కిన గౌరవమని, ఆత్మగౌరవానికి ప్రతీకలని పేర్కొన్న ఆయన, ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు.



స్థానిక ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని అడ్డుకున్నాం: సీఎం నారా చంద్రబాబు నాయుడు

అమరావతి, సందేశం టైమ్స్ ప్రతినిధి: రాష్ట్రంలో ఇటీవలే ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు నగదు పంపిణీని మెజారిటీ స్థాయిలో నియంత్రించడంలో విజయం సాధించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సోమవారం రోజున అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ధనప్రభావానికి అడ్డుకట్ట వేసి పారదర్శకతను పెంచేందుకు తమ ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తోందని సీఎం స్పష్టం చేశారు. పెద్ద నోట్ల రద్దు, డిజిటల్ లావాదేవీల వైపు అడుగులు వేయడం ద్వారా మాత్రమే ఎన్నికల్లో అక్రమాలకు స్వస్తి చెప్పవచ్చని తెలిపారు. ఎన్డీయే కూటమి ఘన విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఈ విజయం తమపై బాధ్యతను మరింత పెంచిందని, నవంబర్ 12, 13 తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న సిఐఐ పార్ట్‌నర్ షిప్ సమిట్ ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడమే తమ ప్రధాన లక్ష్యమని చంద్రబాబు నాయుడు వివరించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే వైఎస్సార్‌సీపీ లక్ష్యం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



తాడేపల్లి, సందేశం టైమ్స్ ప్రతినిధి: రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు మరియు ప్రజల హక్కుల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టి.జె.ఆర్. సుధాకర్ బాబు మరియు ఇతర సీనియర్ నాయకులు పాల్గొని మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన పరిణామాలపై, కూటమి ప్రభుత్వ వైఖరిపై వైఎస్ జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మరియు కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయించడం, అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన మండిపడ్డారు. ఎంతటి ఒత్తిళ్లు ఎదురైనా బెదిరింపులకు లొంగకుండా ప్రజల తరపున క్షేత్రస్థాయిలో గళమెత్తుతామని, రాబోయే రోజుల్లో న్యాయ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు.

కరవు వేళ ప్రాజెక్టు బ్యూటిఫికేషనా?.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన కేటీఆర్



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు లేకుండానే పబ్లిక్ హియరింగ్‌లు నిర్వహిస్తున్నారని, ప్రాజెక్టులకు సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం కాకుండానే టెండర్లు పిలుస్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం (నవంబర్ 9) సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన, రాష్ట్రంలో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొన్న సమయంలో ప్రజలను ఆదుకోవడం మాని, మూసీ బ్యూటిఫికేషన్ పేరిట నిధులు ఖర్చు చేయడమేంటని సూటిగా ప్రశ్నించారు. ఈ రకమైన చర్యలను 'తుగ్లక్ పాలన' కాకపోతే ఇంకేమనాలని ఎద్దేవా చేశారు.

అలాగే, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. మరణించిన పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న నాయకుడిని అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి, కక్షసాధింపు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రతిపక్షాలను నిర్బంధాలతో భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదని, పట్నం నరేందర్‌రెడ్డిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలి – మంత్రి వివేక్ వెంకటస్వామి

నర్సాపూర్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ పంటల మార్పిడిపై దృష్టి సారించాలని, నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. వ్యవసాయంతో పాటు పశుపోషణను అభివృద్ధి చేసుకోవడం ద్వారా రైతులు అదనపు ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మెదక్ జిల్లా ప్రజల తాగునీటి అవసరాలకు సింగూరు జలాల వినియోగానికి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రాంచంద్రాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర పశుసంవర్ధక శిబిరంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువులు, గొర్రెలకు గాలికుంటు వ్యాధి నివారణ, నట్టల నివారణ మందులను పంపిణీ చేసి, జిల్లాలో పశువులు, గొర్రెలు, మేకలకు అందుతున్న వైద్య సేవలపై పశువైద్యులను అడిగి తెలుసుకున్నారు. గొర్రెల కాపరులు మంత్రికి గొర్రెను బహూకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో ఒక ప్రకృతి వైపరీత్యమని, దానిని ఎవరూ నియంత్రించలేకపోయినా ముందస్తు జాగ్రత్తలతో దాని ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో భూగర్భ జలమట్టాలు సుమారు మూడు మీటర్లు పడిపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారని, రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల బోర్‌వెల్స్ ఉండగా, అక్టోబర్ నెలలోనే 20 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగినట్లు తెలిపారు. రైతులు నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని, వరి సాగుకు అధికంగా నీరు, విద్యుత్ అవసరమయ్యే నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఇప్పటి నుంచే పంటల మార్పిడి చేపట్టకపోతే వచ్చే యాసంగి సీజన్‌లో నీటి కొరతతో పంట నష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించాలని కోరుతూ, రాష్ట్ర రైతుల సమస్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లేందుకు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు కలిగే నష్టాలను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. తన తండ్రి కాకా వెంకటస్వామి ఈ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు గతంలో ఎంతో కృషి చేశారని, ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలన్నది ఆయన కల అని గుర్తుచేశారు. ప్రాజెక్టు కోసం గతంలో సుమారు రూ.11 వేల కోట్ల మేర ఖర్చు జరిగిందని, ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపాల్సిన అవసరం ఉందన్నారు. మహారాష్ట్ర 150 మీటర్ల నీటిమట్టానికి అంగీకరిస్తే ఈ ప్రాంతానికి సాగునీరు అందించే అవకాశాలు మెరుగుపడతాయని, ఈ విషయంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. సాగునీటి సమస్య రాజకీయాలకు అతీతమైనదని, రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని పంపింగ్ చేసే ప్రతిపాదనలపై స్పందిస్తూ పంపింగ్, నీటి నిల్వ, విద్యుత్ అవసరాలు, సాంకేతిక పరిస్థితులను పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రాజెక్టు మరమ్మతులకు సంబంధించి సాంకేతిక పరీక్షలు, బోర్‌వెల్స్ పరిశీలన పూర్తయ్యాక తదుపరి చర్యలు చేపడతామని వివరించారు. సింగూరు జలాల వినియోగంపై స్థానిక ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తులను పరిశీలించి, ఈ విషయమై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడి మెదక్ జిల్లా తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. సమగ్ర పశుసంవర్ధక శిబిరాల ద్వారా పశువులకు వైద్య సేవలు అందించడంతో పాటు రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పశుసంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా గ్రామాల్లో పశుసంపద పెంపుతో పాటు గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మెదక్ జిల్లా ప్రజలకు మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పశుసంపద పెంపుతో పాటు పాల ఉత్పత్తి, ఇతర పశుసంవర్ధక ఉత్పత్తులను పెంచాలని, పశువులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, రాంచంద్రాపురం సర్పంచ్ గీతా నరేందర్, నర్సాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి రాజు యాదవ్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆదిత్య వర్మ, ఉప సర్పంచ్ నవీన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

అమావాస్య సందర్భంగా శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు



మెదక్ నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి) మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం పరిధిలో పెద్దాపూర్ గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి కి పూజలు అమావాస్యను పురస్కరించుకుని శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ గణపతి స్వామికి అభిషేకం, శ్రీ స్వయంభు బ్రహ్మసూత్ర శివలింగానికి రుద్రాభిషేకం, నాగదేవతకు అభిషేకం నిర్వహించారు. అలాగే శ్రీ శనిశ్వర సహిత ఆంజనేయ స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక ఆకుపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.



పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం మంత్రి వివేక్ వెంకటస్వామి

మెదక్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం నర్సాపూర్ మండలంలోని తుల్జాపూర్ గ్రామపంచాయతీ నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడిసెల్లో నివసిస్తున్న అత్యంత నిరుపేద కుటుంబాలకు చెందిన 630 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, 414 మంది లబ్ధిదారులకు రూ.4,14,48,024 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, నిరుపేద కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. జీరో విద్యుత్ బిల్లులు, సన్నబియ్యం పంపిణీ, నూతన పెన్షన్లు, రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్, మహాలక్ష్మి పథకం, ఏటీసీ కేంద్రాల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని, లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి పథకం వరంలాంటిదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నర్సాపూర్ మున్సిపాలిటీలోని మూడో వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి రాజు యాదవ్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, హౌసింగ్ పీడీ మాణిక్యం, తహసీల్దార్ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పశుసంపదను పెంచి రైతులు అదనపు ఆదాయ మార్గాలు ఏర్పాటు చేసుకోవాలి – మంత్రి వివేక్ వెంకటస్వామి



మెదక్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రైతులు వ్యవసాయంతో పాటు పశుసంపదను పెంచుకుని అదనపు ఉపాధి, ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. ఎల్‌నినో ఒక ప్రకృతి వైపరీత్యమని, దాని ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలు, రైతులు సమష్టిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మెదక్ జిల్లా ప్రజల తాగునీటి అవసరాలకు సింగూరు జలాలను వినియోగించేలా ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. సోమవారం నర్సాపూర్ మండలం రాంచంద్రాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు చికిత్స, అవగాహన కార్యక్రమంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువులు, గొర్రెలకు గాలికుంటు వ్యాధి నివారణ, నట్టల నివారణ మందులను పంపిణీ చేయడంతో పాటు జిల్లాలో పశువులు, గొర్రెలు, మేకలకు అందుతున్న వైద్య సౌకర్యాల గురించి పశువైద్యులను అడిగి తెలుసుకున్నారు. గొర్రెల కాపరులు మంత్రికి గొర్రెను బహూకరించారు. అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ జిల్లాలో పశుసంపదను పెంపొందించడం ద్వారా రైతులు వ్యవసాయానికి అనుబంధంగా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయని, రానున్న రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించి సంరక్షించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల బోర్‌వెల్స్ ఉండగా, అక్టోబర్ నెలలోనే 20 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగినట్లు పేర్కొన్నారు. అధిక నీరు, విద్యుత్ అవసరమయ్యే వరి సాగుకు బదులుగా నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, పంటల మార్పిడిపై రైతులు దృష్టి పెట్టకపోతే పంట నష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి రైతులను ఆదుకోవాలని కోరుతామని తెలిపారు. గతంలో తన తండ్రి కాకా వెంకటస్వామి ఈ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పశుసంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా గ్రామాల్లో పశుసంపద పెంపుతో పాటు గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం తక్కువగా ఉందని, కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సాహానికి అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు. సింగూరు జలాలను మెదక్ జిల్లా ప్రజల అవసరాలకే వినియోగించాలని కోరారు. హైదరాబాద్ నగరానికి ఎల్లంపల్లి, గోదావరి, నాగార్జునసాగర్, హిమాయత్‌సాగర్ వంటి నీటి వనరుల ద్వారా తాగునీరు అందించే అవకాశాలు ఉన్నాయని, మెదక్ జిల్లాకు మాత్రం సింగూరు ప్రధాన నీటి వనరుగా ఉందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు మంచినీటి కొరత లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పశుసంపద పెరగాలంటే పశువుల ద్వారా లభించే పాలతో పాటు ఇతర ఉత్పత్తులను కూడా పెంచాలని సూచించారు. పశువులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. పశుసంవర్ధక శాఖలో సిబ్బంది కొరతను తీర్చాలని, సింగూరు నీటిని పరిశ్రమలకు వినియోగించకుండా జిల్లా ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. జిల్లాలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, రాంచంద్రాపురం సర్పంచ్ గీతా నరేందర్, నర్సాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి రాజు యాదవ్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆదిత్య వర్మ, ఉప సర్పంచ్ నవీన్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి – మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేత



మెదక్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను అరికట్టి, దాడులకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని దళితులపై దాడుల వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నర్సాపూర్ పర్యటనకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ మెదక్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కడారి నాగరాజు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ, జేఎంఎం రాష్ట్ర నాయకుడు ఊరట్ల శివ, ఎంసీఎఫ్ జిల్లా నాయకుడు ఆనంద్, ఎంఆర్‌పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు భిక్షపతి మాట్లాడుతూ మనోహరాబాద్ మండలం కొనాయిపల్లి (పీటీ), కుచారం, తూప్రాన్ మండలం కిష్టాపూర్, శివ్వంపేట మండలం నవాబ్‌పేట్ గ్రామాల్లో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా దళితులపై దాడులు, దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొనాయిపల్లి గ్రామంలో డప్పులు కొట్టినందుకు కనీస వేతనం ఇవ్వాలని అడిగిన కారణంగా గ్రామ సర్పంచ్ మన్నె కళ్యాణ్, ఆయన అనుచరులు సుమారు 40 మంది దళితులపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారని ఆరోపించారు. ఈ దాడిలో విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు గ్రామపంచాయతీ కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. కుచారం గ్రామంలో దళిత సర్పంచ్ బతుకమ్మ ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేయగా, అగ్రవర్ణాలకు చెందిన కొందరు మహిళలు తాము ఆ ప్రదేశంలో బతుకమ్మ ఆడబోమని చెప్పడం కులవివక్షకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రశ్నించిన దళిత సర్పంచ్, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేశారని ఆరోపించారు. తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామంలో గత ఏడాది బతుకమ్మ ఉత్సవాల్లో దళిత మహిళలు పాల్గొనకుండా అడ్డుకున్నారని, ఈ ఏడాది వారు ఉత్సవాలు నిర్వహించడంతో వారిని గ్రామంలో పనులకు పిలవడం మానేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శివ్వంపేట మండలం నవాబ్‌పేట్ గ్రామంలో బతుకమ్మ ఊరేగింపు సందర్భంగా గ్రామపంచాయతీ వార్డు సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, హరి గౌడ్, రవి గౌడ్ కులం పేరుతో దూషిస్తూ చంది సాయిలు, చంది నన్నీ కుమార్‌లపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనలో నన్నీ కుమార్ గొంతు పిసకడంతో తీవ్ర గాయాలయ్యాయని, బాధితులను బెదిరిస్తున్నారని తెలిపారు. వెల్దుర్తి మండలం ఎదులాపల్లి గ్రామంలో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా దాడి జరిగిందని, హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలో గ్రామ నడివీధిలో పుట్టినరోజు వేడుక నిర్వహించినందుకు దళితులపై దాడి చేశారని వివరించారు. జిల్లాలో గతంలోనూ ఇలాంటి ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయని, భవిష్యత్తులో దళితులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దామోదర్ రాజనర్సింహాకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేత

హైదరాబాద్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆరోగ్య శాఖ మంత్రి గౌరవ శ్రీ దామోదర్ రాజనర్సింహాను హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ కమ్మరి బస్వరాజ్ మర్యాదపూర్వకంగా కలుసుకుని, తన సహోదరుని ఏకైక కుమార్తె అలేఖ్య వివాహ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా వివాహ ఆహ్వానం పట్ల సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పత్రి విట్టల్, ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, పట్లోళ్ల గోపాల్ రెడ్డి, మాజీ యువజన సంఘం అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి, పట్లోళ్ల సుధాకర్, బిజీపూర్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఆసుపత్రుల్లోనే అన్ని రకాల వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం – ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలోని ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలను వారి సొంత జిల్లాల్లోనే అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, స్పెషలిస్ట్ వైద్య సేవలు, అవసరమైన వైద్య సిబ్బంది, ఆధునిక డయాగ్నస్టిక్ సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు సైతం హైదరాబాద్‌కు, మెడికల్ కాలేజీ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించవచ్చన్నారు. సోమవారం సచివాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్ – టీవీవీపీ) పునర్వ్యవస్థీకరణపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) రూపొందించిన అధ్యయన నివేదికలోని ప్రతిపాదనలను సమీక్షించారు. డీఎస్‌హెచ్ పరిధిలోని ఆసుపత్రుల కోసం ఇటీవల 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించామని, అవసరమైన మేరకు నర్సులు, టెక్నీషియన్ల నియామకాలు కూడా చేపట్టామని గుర్తుచేశారు. ఈ నియామకాల ఫలితాలు ప్రజలకు అందాలంటే ప్రతి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఏ ఆసుపత్రిలో ఏయే స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి, ఇంకా ఏ విభాగాల్లో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది అవసరం ఉంది, ఎలాంటి వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు కల్పించాల్సి ఉందనే అంశాలపై ఆసుపత్రుల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉన్నప్పటికీ అవసరమైన పరికరాలు, సిబ్బంది లేక వైద్య సేవలు నిలిచిపోయే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. 30, 50, 100 పడకలు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన ఆసుపత్రులకు వాటి స్థాయిని బట్టి వైద్య సేవల పరిధిని నిర్ణయించాలని సూచించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాల్సిన స్పెషాలిటీ విభాగాలు, పడకలు, ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్‌లు, ఇతర మౌలిక సదుపాయాలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ (ఐపీహెచ్‌ఎస్) మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలోని సెకండరీ హెల్త్ కేర్ ఆసుపత్రులను అభివృద్ధి చేయాలని తెలిపారు. ప్రతి ఆసుపత్రిలో అవసరమైన వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు, మందులు, వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, మంజూరైన పోస్టులు, ఐపీహెచ్‌ఎస్ ప్రమాణాల ప్రకారం అవసరమైన సిబ్బంది సంఖ్యను పోల్చి చూసి లోటుపాట్లను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే ఉన్న పోస్టులను అవసరాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించడంతో పాటు అదనంగా అవసరమైన పోస్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్‌ఎస్) కార్యాలయాలను ఏర్పాటు చేసే ప్రతిపాదనపై కూడా మంత్రి సమీక్షించారు. రాష్ట్రస్థాయి డైరెక్టరేట్ నుంచి జిల్లా స్థాయి వరకు స్పష్టమైన పరిపాలనా బాధ్యతలు ఉండాలని, ప్రతి జిల్లాలోని ఆసుపత్రుల పనితీరు, వైద్య సేవల నాణ్యత, మౌలిక సదుపాయాల అభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రుల్లో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వైద్య సేవల్లో లోటుపాట్లు, సిబ్బంది అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించే బాధ్యతలను జిల్లా స్థాయి అధికారులకు అప్పగించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ ఆంకాలజిస్ట్, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మహేశ్ దత్ ఎక్కా, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్. చొంగ్తు, ఆర్థికశాఖ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ, ఏఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ సుబోధ్ తదితరులు పాల్గొన్నారు.



ASDD ఓటర్ల పునఃపరిశీలనకు రాజకీయ పార్టీల సహకారం అత్యంత కీలకం – ఆర్డీఓ డా. కె. రమాదేవి

మెదక్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఓటర్ల జాబితాలో గైర్హాజరైన, వలస వెళ్లిన, మరణించిన, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు నమోదైన (ASDD) ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించి పారదర్శకంగా ధ్రువీకరించాలని ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి డా. కె. రమాదేవి సూచించారు. సోమవారం మెదక్ ఆర్డీఓ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జారీ చేసిన తాజా సూచనలు, మార్గదర్శకాల ప్రకారం ASDD ఓటర్ల పునఃపరిశీలన ప్రక్రియపై చర్చించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటర్ల వివరాల పునఃపరిశీలనను పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల (BLA) సహకారం అత్యంత అవసరమని తెలిపారు. బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాలను పరిశీలించి, ధ్రువీకరణ ప్రక్రియలో ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు అనుబంధం-ఏ, బీ, సీ (Annexure-A, B, C)లో పేర్కొన్న వివరాల ఆధారంగా పునఃపరిశీలన చర్యలు చేపట్టాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ASDD ఓటర్ల క్షేత్రస్థాయి పునఃపరిశీలనకు నవంబర్ 21 చివరి గడువు అని, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి నవంబర్ 26 వరకు గడువు ఉందని వెల్లడించారు. నవంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులను దృష్టిలో ఉంచుకుని అన్ని రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్ల ద్వారా పునఃపరిశీలన ప్రక్రియలో చురుకుగా పాల్గొని ఎన్నికల యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని డా. కె. రమాదేవి కోరారు.

ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేని అర్హులకు మరో అవకాశం – కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR)-2026లో భాగంగా వివిధ కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గైర్హాజరు (Absent), వలస వెళ్లిన (Shifted), మరణించిన (Dead), డూప్లికేట్ (Duplicate)గా గుర్తించి ఎలక్టోరల్ ఫారాలు అందని ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబంధిత ఓటర్లు తమ పూర్తి వివరాలతో ఎలక్టోరల్ ఫారాలను తిరిగి పూరించి సంబంధిత బూత్ స్థాయి అధికారి (BLO)కి సమర్పించాలని పేర్కొన్నారు. ఎలక్టోరల్ ఫారాలు అందని ఓటర్ల బూత్‌వారీ జాబితాలను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థల కార్యాలయాలు, ఇతర ముఖ్యమైన బహిరంగ ప్రదేశాల్లో మరోసారి ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ఓటరు నివాసం మారకుండా అదే ప్రాంతంలో నివసిస్తున్నట్లయితే, గతంలో ఎలక్టోరల్ ఫారం సమర్పించకపోవడానికి గల కారణాలను వివరిస్తూ అనుబంధం-బి (Annexure-B) ప్రకటనతో పాటు పూర్తిగా నింపి సంతకం చేసిన ఫారాన్ని సంబంధిత ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ERO), సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (AERO) లేదా బూత్ స్థాయి అధికారి (BLO)కు స్వయంగా లేదా కుటుంబంలోని వయోజన సభ్యుల ద్వారా అందజేయవచ్చని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, అదే సమయంలో డూప్లికేట్ ఓటరు నమోదుకు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తున్నామని కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి – అదనపు కలెక్టర్ నగేష్



మెదక్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలకు త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 52 దరఖాస్తులు అందగా, వాటిలో భూ భారతి సమస్యలకు సంబంధించి 17, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 11, పెన్షన్లకు సంబంధించి ఒకటి, ఇతర సమస్యలకు సంబంధించి 23 దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తుకు ప్రాధాన్యతనిస్తూ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నిబంధనల ప్రకారం సకాలంలో పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా సమస్యల మూలాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని, దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనుదీప్ జన్మదిన వేడుకలు.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య ఆనందోత్సాహాలు



నవంబర్ 10 (సందేశం టైమ్స్ సంగారెడ్డి): సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ సంగమేశ్వర్ గారి కుమారుడు అనుదీప్ జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అనుదీప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో అత్తమ్మ, మామయ్య, భారతి పిన్ని, శోభా పిన్ని, దాసు, సునంద కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు పాల్గొని అనుదీప్‌ను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయత, ఆనందం వెల్లివిరిసిన ఈ వేడుక ప్రత్యేకంగా నిలిచింది.




పందిళ్ళపల్లిలో రూ.20.04 లక్షలతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు.. లో-వోల్టేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

చింతకాని, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్ళపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.20.04 లక్షల వ్యయంతో నూతన విద్యుత్ లైన్లు, ఎక్స్‌టెన్షన్ పోల్స్ ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో మంజూరైన నిధులతో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల సమీపంలో ఈ పనులను ప్రారంభించారు. గ్రామంలో చాలాకాలంగా ఎదురవుతున్న విద్యుత్ సమస్యలు, లో-వోల్టేజీ ఇబ్బందులను పరిష్కరించడమే లక్ష్యంగా ఈ నిధులను కేటాయించారు. పనుల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లతో పాటు గ్రామంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న నివాసాలకు విద్యుత్ సదుపాయం మెరుగుపరిచేందుకు నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లను విస్తరించనున్నారు. ఈ పనులు పూర్తయితే గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందడంతో పాటు లో-వోల్టేజీ సమస్యలు తగ్గనున్నాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వత్సవాయి పద్మ, వత్సవాయి జానకిరాములు, ఉప సర్పంచ్ మేకల కల్పన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగ సూరా రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆనం ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు ఎన్పీడీసీఎల్ బోనకల్ ఏడీఈ, నాగులవంచ ఏఈ, సంబంధిత కాంట్రాక్టర్, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామస్తులు హాజరయ్యారు. గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపి రూ.20.04 లక్షల నిధులు మంజూరు చేయడంతో పాటు పనుల ప్రారంభానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సంగారెడ్డిలో దీపావళి అమ్మకాల సందడి.. కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్లు..

సంగారెడ్డి, నవంబర్ 10 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి.సంగమేశ్వర్): దీపావళి పండుగను పురస్కరించుకొని సంగారెడ్డి పట్టణంలో వ్యాపారస్తులు వివిధ రకాల పండుగ సామగ్రిని విక్రయిస్తూ సందడి చేస్తున్నారు. పట్టణంలోని మార్కెట్లలో దీపావళికి అవసరమైన ప్రమిదలు, అలంకరణ వస్తువులు, పూజా సామగ్రి, బొమ్మలు తదితర వస్తువులను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. పండుగ సమీపిస్తుండటంతో కొనుగోలుదారులు మార్కెట్లకు చేరుకుని తమకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో వ్యాపారస్తులు ఆశాజనకమైన అమ్మకాలు జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పండుగ నేపథ్యంలో మార్కెట్లలో సందడి నెలకొంది.



బాణాసంచా దుకాణాల్లో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ జి. నరేష్

చింతకాని, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా దుకాణదారులు ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చింతకాని ఎస్ఐ జి. నరేష్ సూచించారు. బాణాసంచా దుకాణాల వద్ద ఎలాంటి అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దుకాణం వద్ద ఇసుక, నీటి డ్రమ్ములు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు అగ్నిప్రమాదం సంభవించినప్పుడు వెంటనే మంటలను అదుపు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. దుకాణాల పరిసరాల్లో ఎవరూ సిగరెట్లు, బీడీలు తాగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాణాసంచా దుకాణాల వద్ద చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా బాణాసంచా విక్రయాలు నిర్వహించినా, భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా సంబంధిత దుకాణదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, దీపావళి వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా దుకాణదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

చీకట్లను పారద్రోలి ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి.. ప్రజలకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ దీపావళి శుభాకాంక్షలు



నవంబర్ 10 (సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా, నియోజకవర్గ ప్రజలకు సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగను ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరియాలని, చీకట్లను పారద్రోలి ఆశలు, ఆకాంక్షలతో కూడిన కొత్త వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. అదే విధంగా బాణాసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ పర్యావరణానికి, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా సురక్షితంగా పండుగ జరుపుకోవాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సూచించారు.

విష్ణు ఉన్నత పాఠశాలలో ఘనంగా పర్యావరణహిత దీపావళి వేడుకలు.. కాలుష్యరహిత పండుగపై విద్యార్థుల ప్రతిజ్ఞ



మెదక్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ప్రాంగణంలో గల విష్ణు ఉన్నత పాఠశాలలో శనివారం పర్యావరణహిత దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నాగజ్యోతి విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టత, ప్రాముఖ్యతను వివరించారు. పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు పర్యావరణానికి హాని కలిగించని రీతిలో దీపావళి జరుపుకుంటామని, వాయు, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే బాణాసంచాకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సహజ రంగులతో అందమైన ముగ్గులు వేసి తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించగా, మరికొందరు పిండి, మట్టితో సంప్రదాయ ప్రమిదలను తయారు చేసి సృజనాత్మకతను చాటుకున్నారు. పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రతిబింబించేలా వివిధ ఆకృతులను రూపొందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. బీవీఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, జనరల్ మేనేజర్ బాపిరాజు, పరిపాలన అధికారి సురేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేలా వేడుకలు విజయవంతంగా నిర్వహించడంతో పాఠశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది.



సంగారెడ్డి పట్టణ అభివృద్ధికి పెద్దపీట.. రూ.55 లక్షలతో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

నవంబర్ 10 (సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): సంగారెడ్డి పట్టణంలోని పలు వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన పనులకు మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ శ్రీకారం చుట్టారు. పట్టణంలోని 9వ వార్డు సప్తగిరి కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను, 35వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రారంభించిన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీలత శ్రీశైలం, నర్సమ్మ ప్రసాద్, సంగీత మహేష్, సతీష్ రెడ్డి, వంశీ, శైలేష్ రెడ్డి, రవి నాయక్, కాంగ్రెస్ నాయకులు సురేష్, కిరణ్, రమేష్‌తో పాటు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగుల సంబరాలు.. నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం: కాంగ్రెస్ నాయకులు

నవంబర్ 10 (సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీ కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు దీపావళి సంబరాలు నిర్వహించారు. జిన్నారం 18వ వార్డు కౌన్సిలర్ ఎర్రవల్లి దీనా ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు అందేలా తమ వంతు ప్రయత్నం కొనసాగిస్తామని, ఇల్లు లేదని ఏ ఒక్క పేద కుటుంబం ఆందోళన చెందకుండా ప్రభుత్వానికి నివేదిక అందించి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకరయ్య, గోకర వెంకటేష్, పల్నాటి భాస్కర్, యనగండ్ల నరేందర్, వడ్ల నరేష్, అనిల్, లాలు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరవెల్లి గ్రామ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన పట్లోళ్ల శివశరణ్.. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్ష



నవంబర్ 10 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): దీపావళి పండుగను పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలోని వట్టిపల్లి మండలం మరవెల్లి గ్రామ ప్రజలకు పట్లోళ్ల శివశరణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో నూతన ఆశలు, ఆనందాలు తీసుకురావాలని కోరారు. గ్రామ ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా, ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండుగను జరుపుకోవాలని పట్లోళ్ల శివశరణ్ ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యం.. పీఎం రహత్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: నర్సాపూర్ ఎస్ఐ రంజిత్ రెడ్డి



నర్సాపూర్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స ఆలస్యం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని నర్సాపూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠంగా ఏడు రోజుల వరకు వైద్య చికిత్స పొందే అవకాశం ఉందని, బాధితుల ఆదాయంతో సంబంధం లేకుండా పథకం నిబంధనల ప్రకారం అర్హులైన వారికి ఈ సదుపాయం వర్తిస్తుందని వివరించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పట్టణ, గ్రామీణ రహదారులపై జరిగే మోటారు వాహన ప్రమాదాల్లో గాయపడిన వారికి గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112కు ఫోన్ చేయాలని, క్షతగాత్రులను వీలైనంత త్వరగా సమీపంలోని పీఎం రహత్ పథకం పరిధిలోని గుర్తింపు పొందిన ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఆసుపత్రి సిబ్బందికి పీఎం రహత్ పథకం కింద వైద్య చికిత్స అందించాలని తెలియజేయాలని కోరారు. రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, డబ్బుల సమస్యతో ఎవరూ వైద్య చికిత్సకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామ ప్రజలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారాన్ని ప్రచారం చేయాలని ఎస్ఐ రంజిత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరి అప్రమత్తత మరొకరి ప్రాణాలను కాపాడగలదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి.. ఎల్లంకి డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం

నర్సాపూర్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జాతీయ న్యాయ సేవా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నర్సాపూర్‌లోని ఎల్లంకి డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎస్ఐ-2 జగన్నాథ్, సీనియర్ న్యాయవాది సీహెచ్ స్వరూపారాణి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లగండ్ల అశోక్ కుమార్ పటేల్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు చట్టాలు, న్యాయపరమైన హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే భారత రాజ్యాంగం, చట్టాలు కల్పించిన హక్కులు, బాధ్యతలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మహిళలు, బాలలపై వేధింపులు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, పోక్సో చట్టం, బాలల హక్కులు, సైబర్ నేరాల నివారణ చర్యలు, ఉచిత న్యాయ సహాయం వంటి అంశాలను వివరించారు. ఎవరైనా అన్యాయానికి గురైతే భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించి చట్టబద్ధంగా న్యాయం పొందాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ న్యాయానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో న్యాయ సేవాధికార సంస్థలు అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు కార్యక్రమం ద్వారా తెలుసుకున్న న్యాయపరమైన అంశాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు తెలియజేస్తూ ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, ఎం. అరుణ, వై. శ్రీనివాస్‌తో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



బహిరన్ దిబ్బ గ్రామ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ పంపాటి వీరప్ప

మెదక్ / అల్లాదుర్గం, నవంబర్ 10 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్): దీపావళి పండుగను పురస్కరించుకుని బహిరన్ దిబ్బ గ్రామ ప్రజలకు గ్రామ సర్పంచ్ పంపాటి వీరప్ప హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యం, సోదరభావంతో పండుగను జరుపుకోవాలని, బహిరన్ దిబ్బ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరోసారి ప్రతి ఒక్కరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.



పేరెంట్–టీచర్ సమావేశానికి హాజరై విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న సర్పంచ్ బంజ లావణ్య రవి

వెల్దుర్తి, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శేరిల్లా గ్రామంలో నిర్వహించిన పేరెంట్–టీచర్ సమావేశానికి గ్రామ సర్పంచ్ బంజ లావణ్య రవి హాజరై విద్యార్థుల సమస్యలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, ఉదయం అందించే అల్పాహారం తదితర అంశాలపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన సౌకర్యాల గురించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని సర్పంచ్ బంజ లావణ్య రవి తెలిపారు.



అనంతసాగర్‌లో నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్...

నవంబర్ 10 (సందేశం టైమ్స్) తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి.సంగమేశ్వర్).సంగారెడ్డి జిల్లా అనంతసాగర్ గ్రామంలో కుమార్ నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుమార్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం గ్రామ సర్పంచ్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను సర్పంచ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సర్పంచ్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, స్థానిక పరిస్థితులపై నాయకులు పరస్పరం చర్చించుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్లు, రాజీవ్ యువ వికాసం పథకాలకు వెంటనే నిధులు మంజూరు చేయాలి



సంగారెడ్డి, నవంబర్ 10 (సందేశం టైమ్స్) మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేయూత పింఛన్లు, రాజీవ్ యువ వికాసం పథకాలకు నిధులు మంజూరు చేసి అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు, స్వయం ఉపాధి రుణాలు అందించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీసీ సంక్షేమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టి పోరాటం కొనసాగిస్తామని ప్రభుగౌడ్ స్పష్టం చేశారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్టోళ్ల మల్లికార్జున పాటిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రభుగౌడ్, ఉపాధ్యక్షుడు డి. కిష్టయ్య, ప్రధాన కార్యదర్శులు పార్వతి కృష్ణ, నాగరాణి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. అంజనేయులు, ప్రధాన కార్యదర్శి జె. రాజేశ్వర్ స్వామి, కోశాధికారి సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షులు శ్రీధర్, మహేందర్, ముఖ్య సలహాదారు కరంజిత్ సింగ్, కార్యదర్శులు గౌలీశ్వర్, శ్రీనివాస్, ప్రవీణ్, మహేష్, సభ్యులు యాదగిరి, రవీందర్ పాల్గొన్నారు. అలాగే యూత్ కమిటీ అధ్యక్షుడు జావిద్, మహిళా కమిటీ అధ్యక్షురాలు మంజుల గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షురాలు మానస, కార్యదర్శి వీరమణి, సదాశివపేట మండల అధ్యక్షురాలు మౌనిక తదితరులు పాల్గొన్నారు.



పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజాప్రభుత్వం – శేరి వెంకట్ రెడ్డి, మొరబోయిన కృష్ణ

అందోల్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా అందోల్ మండల్ లో పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మొరబోయిన కృష్ణ అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహా ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా ఆదివారం అందోల్ మండలం కంసాన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు చాకలి లక్ష్మి రవి నివాసంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు దీపాలు వెలిగించి, ఇంటికి ప్రత్యేక స్టిక్కర్ అంటించి, గ్రూప్ ఫొటోలు దిగారు. తమ సొంతింటిలో తొలిసారిగా దీపావళి పండుగ జరుపుకోవడం పట్ల లక్ష్మి రవి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శేరి వెంకట్ రెడ్డి, మొరబోయిన కృష్ణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని, నూతన గృహాల్లో దీపాలు వెలిగించి పండుగ జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. పేదల జీవితాల్లో సంతోషం, భద్రత, కొత్త ఆశలు నింపడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి దీపావళి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొని కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలయ్య, వార్డు సభ్యులు వని రమాదేవి, దుర్గయ్య, మాజీ వార్డు సభ్యుడు మొరబోయిన లక్ష్మిదత్తు, నాయకులు మొరబోయిన ఈశ్వరయ్య, మన్నే దత్తయ్య, రామన్నగారి చంద్రయ్య, రామన్నగారి కిష్టయ్య, చాకలి యాదయ్య, చాకలి ఆశయ్య, చాకలి ఈశ్వర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బస్సు ఎక్కే క్రమంలో ప్రమాదం.. వ్యక్తి కాళ్లపై నుంచి వెళ్లిన వెనుక చక్రాలు





మెదక్ , నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి) మెదక్ జిల్లా లో దుంపలకుంట ఎక్స్ రోడ్డు చౌరస్తా వద్ద బస్సు ఎక్కే క్రమంలో ఓ వ్యక్తి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. మెదక్ నుంచి పటాన్‌చెరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికుడు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ క్రమంలో బస్సు వెనుక చక్రాలు అతని కాళ్లపై నుంచి వెళ్లడంతో కాళ్లు తీవ్రంగా నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పెద్దగా కేకలు వేస్తూ బస్సును ఆపాలని డ్రైవర్‌ను హెచ్చరించినప్పటికీ డ్రైవర్ వెంటనే స్పందించకుండా ముందుకు వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో కొంతదూరం వెళ్లిన తర్వాత స్థానికులు బస్సును ఆపి డ్రైవర్‌ను నిలదీశారు. అనంతరం స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించగా, సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తితో పాటు బస్సు డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి జోగిపేటకు చెందినవాడిగా గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రత్యక్ష సాక్షులు ఆరోపిస్తున్నారు.

MDR ఫౌండేషన్ కార్యాలయంలో ఘనంగా దీపావళి వేడుకలు



పటాన్‌చెరు, నవంబర్ 10 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు పట్టణంలోని MDR ఫౌండేషన్ కార్యాలయంలో లక్ష్మీ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, MDR ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ దీపావళి పండుగ చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆశ, ఆనందం, ప్రేమ, ఐకమత్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో పాటు సురక్షితంగా దీపావళి వేడుకలను జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాద్రి దేవేందర్ రాజు, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ముఖ్య సమావేశం.. హాజరుకానున్న జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి, నవంబర్ 10(సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ఈ నెల 11వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు సంగారెడ్డి చౌరస్తాలోని పి.ఎస్.ఆర్. గార్డెన్స్‌లో ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు టీం జగ్గారెడ్డి వెల్లడించింది. ఈ సమావేశానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి పాల్గొననున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని టీం జగ్గారెడ్డి కోరింది.





రామకృష్ణాపురంలో ఎమ్మెస్ఎఫ్ గ్రామ కమిటీ ఎన్నిక.. అధ్యక్షుడిగా పగిడిపల్లి అభి ఏకగ్రీవ ఎన్నిక

చింతకాని, నవంబర్ 10 (సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి): ఖమ్మం జిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎమ్మెస్ఎఫ్) గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. గ్రామంలోని పాత కాలనీలో గుంటి అరవింద్ అధ్యక్షతన, కొత్త కాలనీలో గద్దల మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశాలకు ఎమ్మెస్ఎఫ్ జిల్లా నాయకులు పగిడిపల్లి రవీంద్ర, చిర్రా ఉపేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెస్ఎఫ్ గుండెకాయగా నిలవాలని, పీడిత కులాల గొంతుకగా మారి అణగారిన వర్గాల విద్యార్థులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అవసరమైతే కృష్ణ మాదిగ స్ఫూర్తితో ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండాలని అన్నారు. అనంతరం నిర్వహించిన గ్రామ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పగిడిపల్లి అభిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, కమిటీ సభ్యులుగా గుడిపాటి యశ్వంత్, గుర్రం రక్షిత, బొప్పి భార్గవి, గుంటి త్రివేన్, పగిడిపల్లి మాధవి, గుంటి శ్రీనివాస్, భరత్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ఎఫ్ మండల అధ్యక్షుడు నారపోగు నాగేంద్రబాబు, కుక్కల దిలీప్, గ్రామ పెద్దలు పగిడిపల్లి వసంతరావు, రాయలమీర స్వామి, బుర్ర జయరాజు, పగిడిపల్లి పెద్ద బాలస్వామి, సోదరుల నాగేంద్రం, గుర్రం లాలు, గుంటి హుస్సేన్‌తో పాటు యువజన సభ్యులు గుడిపాటి గోపి, పగిడిపల్లి సాయి తేజ, ఏంపంగి బాలకృష్ణ, పగిడిపల్లి తేజ, బుర్ర ప్రేమ్ కుమార్, గద్దల అశోక్, పగిడిపల్లి గోపి, గుడిపాటి అరవింద్, పగిడిపల్లి నాగమణి, పగిడిపల్లి వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేరబోయిన గూడెం ఇసుక రీచ్ అక్రమాలను వెంటనే అరికట్టాలి.. చిత్తలూరు గ్రామ ఇసుక రీచ్ కమిటీ డిమాండ్



సూర్యాపేట, నవంబర్ 10 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): నాగారం మండలం పేరబోయిన గూడెం ఇసుక రీచ్‌లో జరుగుతున్న అక్రమాలను వెంటనే అరికట్టి, సూర్యాపేట జిల్లా పేరబోయిన గూడెం, నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామాల మధ్య ఇసుక రీచ్ సరిహద్దులను స్పష్టంగా నిర్ణయించాలని నల్లగొండ జిల్లా శాలిగౌరారం మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరు శంకర్ రెడ్డి, చిత్తలూరు గ్రామ సర్పంచ్ గిరగాని వెంకన్న, గ్రామ ఇసుక రీచ్ కమిటీ అధ్యక్షుడు భీమగాని వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు చిత్తలూరు గ్రామ ఇసుక రీచ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేరబోయిన గూడెం గ్రామానికి చెందిన కొందరు చిత్తలూరు గ్రామ సరిహద్దుల్లోకి వచ్చి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో ఆర్డీఓ, మైనింగ్ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పరిష్కారం లభించలేదని తెలిపారు. రెండు గ్రామాల మధ్య వివాదాలు మరింత తీవ్రరూపం దాల్చకుండా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఇసుక రీచ్ సరిహద్దులను నిర్ణయించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తలూరు గ్రామ ఉపసర్పంచ్ యన్నమల్ల శంకర్, మాజీ సర్పంచ్ బొమ్మగాని రవి, కోఆప్షన్ సభ్యులు దాసరి దేవచిత్త, సుంకరి వినీత్, చిలువేరు కిరణ్, యర్ర లక్ష్మి, రాచమల్ల సైదమ్మ, శంభయ్య, తేలుకుంట్ల జయమ్మ, పీరనాయకం జ్యోతి, నరేష్‌తో పాటు చిత్తలూరు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ఫిర్యాదులపై వేగంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలి.. జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్

సూర్యాపేట, నవంబర్ 10 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బాధితులు అందించిన వినతులను పరిశీలించి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించాలని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన పోలీస్ సేవలు అందించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజల రక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరు వర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా, చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు.

సాయం చేయాలనే మంచి మనసుంటే కుల, మత, ప్రాంత భేదాలు అడ్డుకావు.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం



సూర్యాపేట, నవంబర్ 10 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): కుల, మత, ప్రాంత భేదాలు చూడకుండా ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలనే మంచి మనసు ఉంటే చాలు, మానవత్వం ఎప్పుడూ మనిషిని ముందుండి నడిపిస్తుందని సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కార్తీక్ తన తల్లిదండ్రులతో కలిసి కారులో తెనాలి నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తుండగా, సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని బరాఖత్ గూడెం సమీపంలో జాతీయ రహదారిపై కారు మరమ్మతుకు గురై నిలిచిపోయింది. అదే మార్గంలో వెళ్తున్న సోమయ్య కంభంపాటి మొదట కారును గమనించినప్పటికీ, కొంతసేపటి తర్వాత తిరిగి అదే మార్గంలో వస్తున్న సమయంలో కారు ఇంకా అక్కడే నిలిచి ఉండటాన్ని గుర్తించి, వెళ్లి ఏమైందని అడిగి తెలుసుకున్నారు. కారు మరమ్మతుకు గురైందని వారు చెప్పడంతో కార్తీక్‌ను తన స్కూటీపై తీసుకెళ్లి సమీపంలోని మెకానిక్ షాపుల వద్ద ప్రయత్నించారు. ఆ సమయంలో మెకానిక్‌లు అందుబాటులో లేకపోవడంతో కోదాడలోని మెకానిక్‌కు ఫోన్ చేసి రప్పించారు. మెకానిక్ వచ్చి కారును కోదాడలోని గ్యారేజీకి తీసుకెళ్లగా, కారు మరమ్మతు పూర్తయ్యే వరకు సోమయ్య వారితోనే ఉండి, మరమ్మతు బిల్లును సైతం చెల్లించి, అనంతరం వారిని హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారి మార్గం వరకు తీసుకెళ్లి సురక్షితంగా పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు కార్తీక్‌తో గతంలో ఎలాంటి పరిచయం లేదని, కనీసం ముఖ పరిచయం కూడా లేకపోయినా ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలనే ఆలోచనతో ముందుకు వచ్చానని తెలిపారు. నేటి సమాజంలో చాలామంది ఇతరుల సమస్యలను పట్టించుకోకుండా తమ పని తాము చూసుకుంటూ వెళ్లిపోతున్న పరిస్థితుల్లో, తోటి మనిషికి అవసరమైన సమయంలో అండగా నిలవడం ఎంతో ముఖ్యమని అన్నారు. మనిషి జీవితం ఎప్పుడు ఎలా ముగుస్తుందో ఎవరికీ తెలియదని, మనం చేయగలిగిన సాయాన్ని మాత్రం తప్పకుండా చేయాలని సూచించారు. సాయం పొందేవారు మనకు తెలిసినవారా, తెలియనివారా, మన ప్రాంతం వారా, ఇతర ప్రాంతాల వారా అనే భేదాలు చూడకుండా మానవత్వంతో స్పందించాలని, ఆశించకుండా చేసే సాయం ఏదో ఒక రూపంలో తిరిగి మనకే మంచిని కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజాసేవకుల సేవలకు గుర్తింపు ఇవ్వడం అభినందనీయం.. అవార్డు కార్యక్రమంపై మన్నే పోచయ్య ప్రశంసలు



మునిపల్లి, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రజాసేవలో విశేష కృషి చేస్తున్న నాయకులను గుర్తించి సత్కరించేందుకు సంస్థ, దాని వ్యవస్థాపకులు ఒగ్గు సతీష్ సోదరులు నిర్వహిస్తున్న అవార్డుల కార్యక్రమం అభినందనీయమని సందేశం టైమ్స్ విలేకరి మన్నే పోచయ్య అన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుల సేవలను గుర్తించి తగిన గౌరవం అందించే వేదికలు అరుదుగా ఉంటాయని, అలాంటి గొప్ప ఆలోచనతో అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ అవార్డుల ద్వారా ప్రజాసేవకులను సత్కరించడమే కాకుండా, మరింత బాధ్యతతో ప్రజలకు సేవ చేయాలనే స్ఫూర్తిని అందిస్తున్నారని తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్న తమలాంటి వారికి ఈ కార్యక్రమం ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందని పేర్కొంటూ, కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంస్థకు, వ్యవస్థాపకులు ఒగ్గు సతీష్ సోదరులకు హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మరెందరో ప్రజాసేవకులకు ఈ వేదిక ద్వారా గుర్తింపు, గౌరవం లభించాలని ఆకాంక్షించారు.



నగరి ఎంపీటీసీ ఫలితాల్లో అవకతవకలు జరిగాయంటూ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మాజీ మంత్రి ఆర్‌కే రోజా ఆందోళన

సందేశం టైమ్స్ ఆంధ్ర ప్రదేశ్ ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఉప ఎన్నికల లెక్కింపు సందర్భంగా చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విజయపురం మండలం ఇల్లత్తూరు ఎంపీటీసీ స్థానంలో తమ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం సాధించినప్పటికీ, అధికారులు కేవలం 3 ఓట్ల తేడాతో టీడీపీ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారని ఆరోపిస్తూ మాజీ మంత్రి ఆర్‌కే రోజా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని, అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి ఫలితాన్ని తారుమారు చేశారని మండిపడుతూ ఆమె వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి కౌంటింగ్ కేంద్రం ముందు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో స్థానిక పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, న్యాయమైన రీకౌంటింగ్ నిర్వహించే వరకు తమ పోరాటం ఆపేది లేదని రోజా స్పష్టం చేశారు.

కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్న జగ్గారెడ్డి: ప్రజలకు శుభాకాంక్షలు





సంగారెడ్డి, నవంబర్ 09 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి పట్టణంలోని రామ్‌నగర్‌లోగల తన స్వగృహంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగ వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకుని సతీమణి నిర్మల జగ్గారెడ్డి, కుమార్తె జయా చైతన్య రెడ్డిలతో కలిసి ఇంట్లో దీపాలు వెలిగించి వేడుకల్లో పాల్గొన్న ఆయన, అనంతరం సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిని పారద్రోలి వెలుగులు నింపే ఈ దివ్య పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఆనందం, శాంతి మరియు అష్టైశ్వర్యాలను నింపాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.



బ్రహ్మంగారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

మెదక్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ రహదారిపై చిన్న చింతకుంట గ్రామ గేటు వద్ద ఏర్పాటు చేసిన బ్రహ్మంగారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని విశ్వకర్మ సంఘం సభ్యులు, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, వెంటనే సమగ్ర విచారణ చేపట్టి విగ్రహ ధ్వంసానికి పాల్పడిన వారిని గుర్తించాలని పోలీసు అధికారులను కోరారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి.. మరో యువకుడికి తీవ్ర గాయాలు

న్యాల్కల్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం గంగ్వార్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బొల్లి శ్రీకాంత్ (19) అనే యువకుడు మృతి చెందగా, అతని సహోద్యోగి ఎరుకల సాయికిరణ్ (21) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం న్యాల్కల్ గ్రామానికి చెందిన బొల్లి శ్రీకాంత్, సాయికిరణ్ ఇద్దరూ జహీరాబాద్‌లోని మహీంద్రా కంపెనీకి పని నిమిత్తం మోటార్ సైకిల్ (TS 15 ET 6477)పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఉదయం సుమారు 5:30 గంటల సమయంలో హద్నూర్ నుంచి గంగ్వార్ వెళ్లే మార్గంలో రోడ్డుపై నిలిపి ఉంచిన లారీ (AP 23 Y 5958)ను వారి ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించగా, శ్రీకాంత్ జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సాయికిరణ్‌ను మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి తండ్రి బొల్లి సంగన్న ఉదయం 7 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, హద్నూర్ ఎస్ఐ దోమ సుజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడి మృతితో న్యాల్కల్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



నేటి రాశి ఫలితాలు – 10-11-2026

మేషం: వ్యాపారాలు అభివృద్ధి బాటలో సాగుతాయి. నూతన వ్యవహారాలను ప్రారంభిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ధన వ్యవహారాలు కలసివస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగపరంగా ముఖ్యమైన చర్చలు సఫలమవుతాయి.

వృషభం: వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆప్తులతో విభేదాలు చికాకు పరుస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. రుణ ప్రయత్నాలు ఫలించవు. వృథా ఖర్చులు అధికమవుతాయి. చేపట్టిన వ్యవహారాలలో జాప్యం కలుగుతుంది.

మిథునం: సన్నిహితుల నుంచి విలువైన సమాచారం సేకరిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలోని పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. చిన్ననాటి మిత్రుల నుంచి ధన సహాయం అందుతుంది.

కర్కాటకం: వ్యాపారాలలో స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేక నష్టపోతారు. చేపట్టిన పనులలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. మానసిక సమస్యలు పెరుగుతాయి. వృత్తి, ఉద్యోగాలలో పరిస్థితులు ప్రతికూలంగా మారుతాయి. వృథా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. రుణభారం అధికమవుతుంది.

సింహం: వృత్తి, వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం లభించి నూతన లాభాలు పొందుతారు. స్థిరాస్తి ఒప్పందాలు కలసివస్తాయి. దీర్ఘకాలిక రుణాలు తొలగుతాయి. ఉద్యోగంలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి.

కన్య: ముఖ్యమైన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. మొండి బాకీలు వసూలవుతాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో ఉన్నత స్థానం లభించే అవకాశాలున్నాయి. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

తుల: వ్యాపారాలు సాధారణంగా సాగుతాయి. చేపట్టిన పనులు నత్తనడకన సాగుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. ఉద్యోగంలో పనిభారం పెరుగుతుంది. ధన వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది.

వృశ్చికం: ఉద్యోగంలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. కుటుంబ సభ్యులు మీ మాటతో విభేదిస్తారు. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి.

ధనుస్సు: వ్యాపారాలలో అంచనాలను అందుకుంటారు. ఆత్మీయుల రాక ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగంలో ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. వృత్తి, వ్యాపారాలలో భాగస్వాములతో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. ఆర్థికంగా ఆశించిన పురోగతి కలుగుతుంది.

మకరం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో కార్యసిద్ధి కలుగుతుంది. చిన్ననాటి మిత్రులతో విందు, వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం లభిస్తుంది. ఆప్తుల నుంచి ఆశించిన సహాయం అందుతుంది. ఆకస్మిక ధన, వస్తు లాభాలు పొందుతారు.

కుంభం: వ్యాపారాలు ఆశించిన రీతిలో లాభించవు. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. వృథా ఖర్చులు పెరుగుతాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. కుటుంబ వాతావరణం చికాకుగా ఉంటుంది. సన్నిహితులతో ధన వ్యవహారాలలో విభేదాలు కలుగుతాయి.

మీనం: బంధువులతో అకారణ వివాదాలు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో అవాంతరాలు ఎదురవుతాయి. స్వల్ప ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. నూతన రుణాలు చేయవలసి వస్తుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నాయి.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.